
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# కుటుంబ చిత్రం

"ఎన్నమ్మా? ( ఏమ్మా?) రమా! " సౌఖ్యమా!"" పలకరించిందావిడ ఎదురుగా వస్తున్న యువతిని చూసి.

" ఆమా, పాటీ" అంటూ జవాబు చెప్పింది రమ. సంభాషణ అంతా తమిళంలో జరిగింది.

" పిల్లలు ఎలా ఉన్నారు? పెద్దవాడికి జ్వరం తగ్గిందా? ఈ మధ్యన కనిపించడం లేదు? ఇంట్లోకి రా, కాఫీ తాగుదువుగాని" లాంటి ప్రశ్నలూ, ఆహ్వానాలతో సంభాషణ సగం అయ్యాకా..

" చాలా పని ఉంది, మళ్ళీ చిన్నవాడు స్కూల్ నించి వచ్చేలోపల చేసేసుకోవాలి" మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళింది రమ

రమ వెళ్ళగానే ఆవిడ నెమ్మదిగా నడుస్తూ మెట్లు దిగసాగింది. ఎదురొచ్చిన శలాక తో

" అరే షలాకా? తూ కసా ఆహేత్? వేళ్ దిసణార్ నాహి? (ఎలా ఉన్నావు? చాలా రోజులుగా కనిపించలేదు?)" అన్నారు.

" ఆమ్హీ శహరాచ్య బాహేర్ ఆహేత్ ఆంటీ! ఆపణ్ కసే ఆహేత్?" ( మేము ఊరిలో లేము ఆంటీ! మీరెలా ఉన్నారు?) అని అడిగింది శలాక.

" మీ ఠీక్ ఆహే"( నేను బావున్నాను)అంటూ మరాఠీ భాషలో ఆ అమ్మాయితో కాసేపు కబుర్లు చెప్పిందావిడ.

" పాటీ, మామీ' అని కొందరూ, 'ఆంటీ' అని మరికొందరూ, 'మాజీ' అని ఇంకొందరూ,' అమ్మా' అని మరిందరూ పిలుస్తారు ఆవిడని. ఆవిడ పేరేమిటో సరిగ్గా తెలీదు ఎవరికీ.

ఆవిడ వయసు డెభ్భై దాకా ఉంటుందేమో? తెల్లగా, సన్నగా, పొట్టీ పొడుగూ కాకుండా ఉంటుందావిడ. ఆవిడా, భర్త గోపాల రావు గారు మాత్రమే ఉంటారు ఇంట్లో.

ఆయన పెద్దగా బయటకు రారు, నిత్య పూజలు, న్యూమరాలజీలో ఆయనకున్న ప్రావీణ్యం, ఆసక్తి లతోనూ, దినపత్రిక, టీ.వీలతో కాలం గడుపుతూ ఉంటారు. ఆయన పనేదో ఆయన అన్నట్టుగా ఉంటారు తప్ప ఎవరి విషయాల్లోనూ కలిగించుకోరు. సాయంత్రం కాసేపు కిందకు వచ్చి తన వయసువారితో కూర్చుని కబుర్లు చెప్పి వెళతారు.

ఆవిడ దానికి పూర్తిగా వ్యతిరేకం, ఎప్పుడూ నలుగురు మనుషులు కావాలి, సందడి, సరదాలూ, రుచులూ అన్ని కావాలి. అవటానికి తెలుగువారే అయినా ఆవిడ చిన్నతనమంతా దేశంలోని వివిధ ప్రాంతాల్లో గడవడం వల్ల తమిళం, మరాఠీ, హిందీ, ఇంగ్లీష్, కొద్దిగా మళయాళం ఇలా అనేక భాషలు అలవోకగా మాట్లాడగలరు. దానివల్ల ఆవిడ ఎప్పుడూ అందరితోనూ కలివిడిగా ఉండడానికి ప్రయత్నిస్తూ, అందరినీ పలకరిస్తూ ఉంటారు. ఆయన ఎప్పుడూ తమ పల్లె వదిలి రాలేదుట. ఆయనకి ముక్కోపం అని చెప్పుకునేవారు

వాళ్ళకి ఇద్దరు పిల్లలు, ఒక అమ్మాయి, ఒక అమ్మాయి. అల్లుడు కూతురు ఎప్పుడైనా వచ్చి నాలుగు రోజులుండి వెళతారు. కానీ కొడుకు ఎప్పుడూ రాగా ఎవరూ చూడలేదు. మూడేళ్ళయి ఉండవచ్చు వాళ్ళు అక్కడకొచ్చి.

ఆయనకి ఆరోగ్యం సరిగా లేనందువల్ల మందులకీ, డాక్టర్లకీ దగ్గరగా ఉంటే మంచిదని ఇక్కడకి వచ్చామనీ, లేదంటే తమకున్న పెద్ద ఇల్లూ, పొలమూ అన్నీ వదిలి రావడం కుదిరే పని కాదు అని ఆవిడ అంటూ ఉంటారు అందరితో.

వాళ్ళ అమ్మాయి గురించి ఎన్నో విషయాలు చెప్పే ఆంటీ కొడుకు విషయాలకొచ్చేసరికి మాత్రం మౌనంగా ఉండిపోతారు. ఎక్కువగా మాట్లాడడానికి ఇష్టపడరు. తరచి చూస్తే ఏదో చెప్పలేని బాధ కనిపిస్తుంది ఆమెలో, అందుకనే ఎవరూ పెద్దగా ఒత్తిడి చెయ్యరు. ఆవిడ మనసులో ఏదో తెలియని బాధ ఉందనీ, దాన్ని మర్చిపోవడానికే ఆవిడ ఎప్పుడూ మనుష్యుల మధ్య సరదాగా ఉండడానికి ఇష్టపడతారని వాళ్ళందరికీ త్వరలోనే అర్థం అయింది. అందుకే ఆవిడ అభిప్రాయాలకి విలువనిస్తూ అందరూ ఆవిడతో స్నేహంగా ఉండేవారు.

మూడు వందల ఫ్లాట్ లున్న ఆ అపార్ట్ మెంట్ కాంప్లెక్స్ లో ఎప్పుడూ సందడే. ఎవరి వయసు కు తగ్గ వారి కి స్నేహితుల గుంపులూ, కబుర్లూ, కాలక్షేపాలకేమీ లోటు లేదు. ఆవిడ మాత్రం వయసుతో సంబంధం లేకుండా అందరితోనూ కలిసిపోతారు, కబుర్లు చెప్తారు. ఒక్కరోజు ఆవిడ కనిపించకపోతే అందరూ ఎంతో మిస్ అవుతారు.

ఉన్నట్టుండి ఒకరోజు వెలిగిపోతున్న ముఖంతో, మెరిసిపోతున్న చిరునవ్వుతో వచ్చి. " రేపు సాయంత్రం మా ఇంట్లో మా మనవడి పుట్టినరోజు, శనివారం మా కొడుకు, కోడళ్ళ పెళ్ళి రిసెప్షన్" మీరందరూ తప్పకుండా రావాలి" అంటూ ఆనందంగా అపార్ట్మెంట్ లో ఇంచుమించు అందరినీ పిలవడం మొదలుపెట్టింది ఆంటీ.

" మనవడి పుట్టినరోజేమిటి? పెళ్ళి రిసెప్షన్ ఏమిటి? వీళ్ళ అబ్బాయి పెళ్ళా ఇప్పుడు? మరి మనవడెవరు? ఆంటీ వాళ్ళ అమ్మాయికి ఇద్దరూ ఆడపిల్లలే కదా? ఆవిడకి ఇంకో అబ్బాయి కూడా ఉన్నాడా? ఎప్పుడూ చూడలేదే? "అనుకున్నారు అపార్ట్మెంట్లో వాళ్ళు.

ముఖం నిండా నవ్వుతో, కళ కళ లాడుతున్న ముఖంతో, మురిసిపోతూ పిలుస్తున్న ఆంటీ ని చూసి ఎవరూ ఆవిడని అడిగే ధైర్యం చెయ్యలేదు.

" తప్పక వస్తాం "అన్నారు అందరూ. అలాగే అందరి మధ్యనా వాళ్ళ మనవడు గోపాల్ పదవ పుట్టినరోజు వేడుక చాలా వైభవంగా జరిగింది.

" వీడే మా మనవడు గోపాల్, మీ అంకుల్ పేరే! అని ఆనందంగా వాడి చెయ్యి పట్టుకుని తీసుకొచ్చి పరిచయం చేసింది ఆంటీ. వాడి నీలి కళ్ళూ, బంగారు రంగు జుట్టూ చూసి ఎంతో బావున్నాడన్నారు. ఇదిగో ఇది వెరోనికా, మా కోడలి అమ్మ పేరు, మా మనవరాలు. తనేమో మా కోడలు దయాన" అని పరిచయం చేసిందావిడ. అచ్చంగా ఆవిడ పోలికలతో అందంగా ఉంది ఆ పాప.

మర్నాడు శనివారం పెద్ద స్టార్ హోటల్లో అంగ రంగ వైభవంగా ఏర్పాట్ల మధ్య జరిగింది పండగలాంటి పార్టీ.

' వెడ్డింగ్ రిసెప్షన్ ఆఫ్ ఆనంద్, దయాన' అన్న అక్షరాలున్న ఆర్చ్. దాని కింద వేసి ఉంది పెద్ద టేబిల్. దానిమీద అందంగా అమర్చి ఉన్న రెండు అంతస్థుల చక్కటి కేక్. అక్కడ మెరిసే ముఖాల్తో, కొత్త పట్టుచీరలో మెరిసిపోతున్న దయనా, ఆమె పక్కనే ఫుల్ సూట్ లో హుందాగా ఉన్న ఆనంద్,పక్కన పిల్లలు వెరోనికా, గోపాల్. గోపాల్ కి పదేళ్ళుంటాయి, వెరోనికా కి ఎనిమిదేళ్ళు.

వాళ్ళిద్దరినీ క్షణం వదలడం లేదు గోపాల రావు గారు. అతిథులందరి సమక్షంలో కేకు కట్ చేశారు ఆనంద్, దయానా. మొదటి ముక్క గోపాల రావుగారికే తినిపించారు.

ఆయన కళ్ళనిండా నీళ్ళు నిండి, గుండె గొంతుకలోకి వచ్చి పొలమారింది. దగ్గో, నవ్వో తెలియకుండా ఉండి పోయారు రెండు క్షణాలు. ఆ తర్వాత కొంచం మంచి నీళ్ళు తాగి మైక్ తీసుకుని

" అందరికీ స్వాగతం, ఈ రోజు మా పిల్లల పెళ్ళి రిసెప్షన్ పార్టీకి వచ్చినందుకు మీ అందరికీ మరోసారి మా ధన్యవాదాలు. ఆనివర్సరీ అని ఉండాలి కదా! రిసెప్షన్ అంటున్నారేమిటా అనుకుంటున్నారా? మీరు చదివినది నిజమే ! ఇది పెళ్ళి రిసెప్షన్, మేము చూడని లేదా నేను చూడడానికి రానని మొండికేస్తే ఆనాడు జరిగిన పెళ్ళి తాలుకు పండగ ఈనాడు. మనస్ఫూ ర్తి గా దయానాని మా కోడలిగా మా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్న రోజీనాడు. అందుకే ఇది వాళ్ళ పెళ్ళి రోజు. మీకర్థం అయ్యేలా చెప్పాలన్నా, నాకు ఇన్నాళ్ళకి అర్థం అయిందని చెప్పాలన్నా మీకు అసలు కథ చెప్పక తప్పదు" అంటూ ఆగారు.

దయానా అప్పటికే " డేడ్!ఇట్ ఈజ్ ఓకే!" అంది మృదువుగా ఆయన చేతిని తడుతూ.

" లేదమ్మా!! నన్ను చెప్పనీ!" అన్నారాయన కూడా అంతే మృదువుగా. గోపాల్, వెరోనికా ఆయన్నే చూస్తున్నారు వింతగా.

" ఇదో పల్లెటూరి కథ. నేను బాగా చదువుకున్నాను. కానీ నాన్నకోరిక వల్ల ఉన్న ఆస్థి చూసుకోవడానికి, వ్యవసాయం చేసుకోవడానికి సిద్ధపడి మా ఊరు వచ్చేశాను. నా ఊరు, నా గాలి, నావాళ్ళు, నా మట్టి.. అప్పటికీ, ఇప్పటికీ నాకెంతో ప్రియమైనవి. నేనూ, నా పనీ, నా పూజలు, మొదటినించీ నాకున్న సంఖ్యాశాస్త్రం మీద ఇష్టం.. ఇదే నా ప్రపంచం. ఊరు వదిలి పెద్దగా ఎక్కడికీ వెళ్ళినదీ లేదు, తిరిగినదీ లేదు. ఇప్పుడైతే నన్ను నేను ' కూపస్థ మండూకం' అనుకోవడానికి నాకేమీ అభ్యంతరం ఉండదు. చిన్నగా నవ్వారాయన.

మా ఊరిలో నేను పెద్దమనిషిని, నా మాటకెంతో విలువ, నేనంటే ఎంతో గౌరవం. నా భార్య గాయత్రి, వాళ్ళ నాన్నగారు సెంట్రల్ గవర్నమెంట్ లో పనిచెయ్యడం వలన ఆవిడ నాలుగు ఊళ్ళూ తిరిగింది, రకరకాల భాషలూ, సంస్కృతీ, సంప్రదాయాలని చూసింది.కనక ఆవిడ ఆలోచనలు ఎప్పుడూ నాకంటే మెరుగ్గా ఉండేవి, ఆ విషయం నాకు తెలిసేసరికీ, తెలిసినదాన్ని ఒప్పుకొనేసరికీ చాలా కాలం పట్టింది. ఆ కాలంలో నావల్ల కొన్ని పెద్ద తప్పులే జరిగాయి, ఎన్నో చిన్నవాటితో పాటు. అంటూ ఆగారు ఊపిరి తీసుకోవడానికి.

మాకున్నది ఇద్దరు పిల్లలు, ఇద్దరినీ నాకు నచ్చినరీతిలో కట్టుదిట్టాల మధ్యన పెంచాను. మనమేం చేసినా ఊర్లో నలుగురూ చెప్పుకునేలా ఉండాలన్నాను, ఒకరితో వేలెత్తి చూపించుకోకూడదు అన్నాను. నా ఇంట్లో ముగ్గురూ నా మాట ఎప్పుడూ కాదనలేదు. పరువూ,ప్రతిష్టా, మన వంశం, మన గొప్పతనం అని నేనన్న మాటలన్నింటికీ వాళ్ళు ఊ అన్నారు, విన్నారు. ఒక్క నా కొడుకు పెళ్ళి విషయం లో తప్ప.

" ఫలానా వాళ్ళని ప్రేమించాలి, నాన్నకిష్టం లేకపోయినా సరే అనుకుని ఎవ్వరూ ప్రేమించరు నాన్నా! అది సాహచర్యం వల్ల కావచ్చు, కలిసిన అభిప్రాయాల వల్ల కావచ్చు, మరేదైనా కారణాల వల్ల కావచ్చు, అనుకోకుండా మరొకరిపై పెరిగే మమకారం. ఎందుకో దయానా నాకు చాలా .నచ్చింది నన్నూ, మన కుటుంబాన్ని బాగా అర్ధం చేసుకుంటుంది, మనందరిలోనూ ఒకరుగా కలిసిపోతుంది అనిపించింది. అందుకే మీ అంగీకారం"

ఇంకా పూర్తి చెయ్యకుండానే నా కొడుకు మీద రుద్ర తాండవం చేశాను. ముఖం చూపించద్దన్నాను. మూడేళ్ళ క్రితం జరిగిన నీ అక్క పెళ్ళి గురించి ఇంకా మూడు ఊళ్ళ వాళ్ళు గొప్పగా చెప్పుకుంటారు, అలాంటి చోట నాకు తలవంపులు తెస్తావా? అన్నాను. ముందూ, వెనకా చూడకుండా వెళ్ళిపొమ్మన్నాను. నాకు చెప్పకుండా వాడాపని చెయ్యడమే తప్పు అన్నది నా భావన అప్పట్లో

తనకున్న విశాల ధృక్పధంతో గాయత్రి నాకు నచ్చచెప్పాలని చూసినప్పుడల్లా నాకోపం మరింత పెరిగిందే తప్ప కనీసం ఆమె చెప్పేది అర్ధం చేసుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదు నేను.

ఇది జరిగి సరిగ్గా పన్నెండేళ్ళు నిన్నటికి. వాడు, నా బిడ్డ పాపం ప్రతీ సారీ అడిగేవాడు. నా సమాధానం ఎప్పుడూ ఒకటే, మూడేళ్ళ క్రితం నాకు గుండె జబ్బు వచ్చి, మందులూ, మంచి ఆసుపత్రుల కోసం మొదటిసారి మా ఊరు వదిలి ఈ మహానగరం వచ్చేదాకా."

ఆహూతులందతూ నిశ్శబ్దంగా వింటున్నారు. ఆయన కొనసాగించారు

"ఇక్కడికొచ్చిన కొత్తలో హాయిగా తిరిగే పక్షి ని తెచ్చి పంజరంలో పెట్టిన బాధ నాలో. నన్నేదో చీకటిగదిలో పెట్టి తలుపులన్నీ మూసేస్తున్న భావన. ఆ భావన వెనకే తెరుచుకున్న తలపులు. వాటిని గుర్తించడానికి గడిచిన సంవత్సరాలు. వెనక్కి తిరిగి చూస్తే ఇవీ నన్ను పలకరించేవి, నిలదీసేవి.

" ఒకరినొకరు పట్టించుకోరు" అన్నది ఒకప్పుడు నగరాల మీద నా అభిప్రాయం– " ఒకరి స్వాతంత్ర్యాన్ని మరొకరు గౌరవిస్తారు" ఇది నేను గమనించిన సత్యం

" ఎప్పుడూ అందరూ బిజీగానే ఉంటారు"– ఒకప్పటి ఆలోచన " అవసరం వస్తే ఏ వేళైనా సహాయం చెయ్యడానికి ముందుంటారు"– ఇప్పటి నా అనుభవం

" చుట్టాలూ, పక్కాలూ లేని ఊరూ ఒక ఊరేనా"– ఒకప్పటి భావన " ఆప్త బంధువుల్ల ఉండే ఆప్త మిత్రులుంటారు"– ఇప్పుడు నాకు తెలిసిన నిజం

" ఇలా చెయ్యడం తప్పు కదూ" అని నేను అప్పుడు అనుకుంటే " జీవితం ఎంతో పెద్దది, గొప్పది, దాంట్లో ఇది ఏమంత ?" ఇది ఇప్పుడు నా అభిప్రాయం

" నలుగురూ ఏమనుకుంటారు?" ఎప్పుడూ ఇదే ఆలోచన నాకు ఒకప్పుడు, అది ఇప్పుడు మారి " ఎవరా నలుగురు? మనవాళ్ళు కాదా? వాళ్ళు ఒక మాట అన్నా, అనుకున్నా నష్టమేమిటి? ఇలా మారాయి నా ఆలోచనలు.

దానికి కారణం, విస్తరించిన నాపరిధి, పెరిగిన నా పరిచయాలు, తెలుసుకున్న సంగతులు, విన్న సంఘటనలు.. అవీ, ఈ మహానగరం నాకు నేర్పిన పాఠాలు.

నా కొడుకు చేసినది నిజంగా తప్పేనా? అన్న అంతర్మధనం ప్రారంభమైన నాడు మొదటిసారి నా మనసులో ఏదో చిన్న కదలిక. .

అన్నేళ్ళూ గాయత్రి కన్నీరు కానీ, మనోవ్యధ కానీ కలిగించలేని కదలిక..

నా కొడుకూ, కోడలూ ఒకసారి వచ్చి కలుస్తామన్నా కనిపించని కదలిక

నా మనవలని చూసుకోవాలని కూడా అనిపించని చోట కలిగిన కదలిక..

ఎన్నో కథలను విన్నాను, పెద్దలని లెక్క చెయ్యని పిల్లలని గురించి, ఈరోజు పెళ్ళాడి రేపు విడాకులంటున్న వారి గురించీ, అసలు పెళ్ళిదాకా కూడా రాకుండానే విడిపోతున్న వారి గురించీ, మానవత్వాన్నీ, మంచినీ మరిచిపోతున్న వారి గురించీ.. ఇలా ఎన్నో.

ఇవి కాదు నన్ను కదిలించినవి..

"ఉన్నది ఒక్క జీవితం, ఎన్ని ఒప్పులు చేస్తే అంత ఆనందం, తప్పు చేసినా వెంటనే తెలుసుకోకపోతే దాని మూల్యం ఒక జీవిత కాలం".. ఇదే అర్థం వచ్చేలా రాసిన మొన్న ఒక నాటకాన్ని చూశాను.

ఈ విషయం పన్నెండేళ్ళయినా నేను తెలుసుకోలేకపోయానా? అనిపించిన క్షణం అది..

ఒక జీవితకాలం లో పుష్కరకాలం చిన్నది కాదు, అందుకే అన్నాను ఇది పెద్ద తప్పని. అప్పటి నా ఆలోచనలని నేను ఇప్పటికీ తప్పనుకోను, కానీ నేను ప్రవర్తించిన తీరు సరి చేసుకోవచ్చు అనిపించింది. వెంటనే సరిచేసుకున్నాను. నా మాట విని గాయత్రి సంతోషంతో పొంగిపోయింది, ఆనంద్ ఉప్పొంగిపోయాడు, మా కోడలు ఆనందంతో కన్నీరు కార్చింది.. పిల్లల సంగతి చెప్పనే అక్కరలేదు.

అమెరికన్ యాసలో వాళ్ళు "టాటాయ్యా" అంటూ ఉంటే మనసు మురిసిపోయింది.

క్షణం ఆలస్యం చెయ్యకుండా వచ్చేశారు, ఎందుకంటే నాకు ఉన్న ఈగో నా బంగారు తండ్రికి లేదు, వాడిదంతా వాళ్ళ అమ్మ పోలిక. అందుకే ఇలా మా కుటుంబ చిత్రం పరిపూర్ణమై, ఫలవంతమైంది. " థాంక్యూ మై చిల్డ్రన్, ఐ యాం టెర్రిబ్లీ సారీ " అన్నారాయన అంతులేని భావోద్వేగాలతో ఆనంద్ నీ, దయానాని దగ్గరకు తీసుకుంటూ..

ఆ ప్రాంగణమంతా పాటు నిశ్శబ్దమైపోయింది. ఆ తర్వాత దాన్ని చీల్చుకుంటూ మొదలైన చప్పట్ల మోతతో మారుమోగిపోయింది. గాయత్రి ఆంటీ చెంపల మీద జల జలా రాలాయి ఆనంద బాష్పాలు..!!

COMMENTS